# "చట్టసభల్లో మెజారిటీ మీదేగా"

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

ఉదయం తొమ్మిదిగంటలవేళ రాజేశ్వరి యింట్లో ఏదోపని చేసుకుంటూ ఉన్నది. కచ్చేరిసావట్లో పడకకుర్చీలో కూర్చుండి టపా చూచుకుంటూ ఉన్న రాఘవరావు 'రాజేశ్వరీ' అని పిల్చాడు. "ఓయి" అంటూ రాజేశ్వరి సావట్లోకివచ్చి 'యెందుకు పిల్చారు' అన్నది. ప్రయాణం వచ్చింది. పెట్టెలు సర్దూ అన్నాడు రాఘవరావు.

"ఎక్కడికి" అన్నది రాజేశ్వరి.

గుంటూరు కన్నాడు రాఘవరావు.

"ఏమి మా మఱదలు పెద్దమనిషైందా? మా మామయ్య ఉత్తరంవ్రాశాడా?" అని అడిగింది రాజేశ్వరి వడివడిగా.

"మీ మఱదలూ పెద్దమనిషి కాలేదు. మీ తమ్ముడూ పెద్దమనిషి కాలేదు. గుంటూరులో మహిళాసభలు. కొందఱు పెద్దమనుష్యుల భార్యలు నిన్ను రమ్మని ఆహ్వానం పంపించారు."

"పెద్దమనుష్యుల భార్యలేమిటి? వారికి వూరూ పేరూ లేనట్టు."

"ఉన్నదో లేదో నాకేమి తెలుసు. దానిలో ఉన్న విషయం చెప్పాను."

"అయితే వారి పేర్లు అందులో లేవా?"

"ఉంటే చదువనా?"

"పేరులేని ఆహ్వానపత్రిక లుంటాయా?"

"ఉన్నవో లేవో నీవే చూడు. రాఘవరావు సతీ" అని ఆహ్వానపత్రిక రాజేశ్వరి చేతికిచ్చాడు రాఘవరావు. రాజేశ్వరి పత్రిక చేతికి తీసుకొని చదువుకొని, "వారందఱు ఉన్నతోద్యోగుల భార్యలు కనుక ఘనంగా ఫలానివారి సతి అని వ్రాసుకున్నారు. అందులో తప్పేమున్నది. ఇప్పు డందఱూ అట్లాగే వ్రాసుకుంటున్నారు గదా?" అన్నది చిఱునవ్వు నవ్వుతూ.

"ఓహో! యిందులో తప్పేమిటో నీకు కన్పడ లేదా? అయితే బ్రతికిపోయినాము. ఇంకా కొన్నాళ్లు మేము నిర్భయంగా ఉండవచ్చు."

"ఒకప్పుడు మాత్రం మీకు నిర్భయం గాకేమి గాని, అసలు మీకు కన్పడిన తప్పేమిటో చెప్ప రాదా?"

"కందకులేని దురద చేమకేమి? నాకెందుకు నేను చెప్పను."

"మాకు తెలివిలేక తెలుసుకోలేదు. తెలిసినవారు మీ రెందుకు చెప్పరాదూ?"

"మీకు వ్యక్తిస్వాతంత్ర్యం కావాలె గాదూ?"

"ఆఁ."

"పురుషులతో సమానహక్కులు కోరుతున్నారు గాదా?"

"అవశ్యం."

"ఇది వట్టి వాగాడంబరం అనుకుంటాను. మన సార మీ కట్టి కోరిక లేదు."

"ఉన్నది. మా తొమ్మిదేండ్ల మహిళాసభా తీర్మానాలూ ఒక్కమాటు తిరగవేసి చూడండి మా స్వాతంత్ర్యాభిలాష నానాటికి యెంత తీవ్రమైపోతు న్నదో మీకే తెలుస్తుంది."

"అది వట్టి వాక్తీవ్రత. పద తీవ్రత. అంతే మనోగతాభిప్రాయంమాత్రం గాదు."

“అట్లా అనుకోటం పొరబాటు. స్వాతంత్ర్యం కోసం మా మహిళాలోకం యెంత ఆవేదనపడుతున్నదీ మా మనస్సులు చొచ్చి చూస్తే తెలుస్తుంది.”

“అంతశ్రమ అక్కర్లేదు. మీ ఆహ్వానపత్రికలు చూస్తేనే విశదమౌతున్నది.”

“ఏమి విశదమౌతున్నది.”

“మీ రింకా మగవారి అండనే ఆధిక్యత పడయ గోరుతున్నారని.”

“ఎందువల్ల ?”

“తమ కొక ప్రత్యేక నామధేయముండగా దానిని మాని ఫలానిఆయన పెండ్లాన్ని అని వ్రాసుకున్నందువల్ల.”

“ఓహో! మంచి సారాంశమే తేల్చారే. భర్త పేరు వ్రాసుకొన్నందువల్లనే మా ఆశయాలకు భంగం వస్తుందా ? దొరసానులందరూ యిట్లాగే వ్రాసుకుంటారు గదా. వారి హక్కుల కేమి భంగం వచ్చింది ? వారు పురుషులతో సమానహక్కు లనుభవించడంలేదా ?”

“అనుభవిస్తున్నారుగాని వీరికైనా యీ స్వరూపనాశనం బాగుండలేదు. ఒక దొరసాని ఒక్కొక్క మొగుడిని పెండ్లాడి వాడితో సఖ్యతచెడితే విడాకులు పుచ్చుకొని మరొకడిని కట్టుకుంటూ ఉంటుంది. ఒక్కొక్క మొగుడిని కట్టుకున్నప్పుడల్లా వాడి పేరే దీని పేరు. దీని కెన్నిటిలో సమానహక్కులున్నా పేరులోమాత్రం సమానహక్కు లేదు. మీకు దేనిలోనూ హక్కు లేకపోగా హక్కున్న ఈ పేరులో దొరసానులను అనుకరించి అదికూడా పోగొట్టుకున్నారు. మన దేశంలో అనాదినుంచీ జనకసంబంధమైన పేరేగాని భర్తృసంబంధమైన పేరు లుంచు ఆచారములేదు. వైదేహి, వైదర్భి, పాంచాలి, శైబ్య, జానకి, ద్రౌపది, ఈ పేరులన్నీ దీనినే సూచిస్తూఉన్నవి. ఈ పేరులు స్త్రీల దేశమును, వారి వంశమును, వారి తండ్రులను వెల్లడిస్తూ చిన్నవిగా ముద్దుగా నున్నవి. ఇక ఇప్పటి పేరులో శారదారమణారావు, పార్వతీనారాయణమూర్తి, సత్యవతీ సీతాపతి, లేకపోతే మిసెస్ శర్మ, మిసెస్ శాస్త్రి, మిసెస్ నాయుడు. వీటికి తెలుగు తర్జుమా పిళ్లైసతి, గుప్తసతి, చౌదరీసతి. ఇవి మరీ అధ్వాన్నంగా ఉన్నాయి. ఇందులో అయ్య పేరూ లేదు. అమ్మ పేరూ లేదు. ఈవిధంగా ఉన్న గోడు కూడా ఊడగొట్టుకుంటూ వ్యక్తిస్వాతంత్ర్యమనీ, సమానహక్కులనీ ఏవేవో పెద్దపెద్ద పేర్లు చెప్పుతుంటె నవ్వు వస్తుంది. రాజేశ్వరీ! మీ ఆడవాళ్లంతా ఈ పేరులు చూచి దీనిలో యేదో గొప్ప ఉన్నదని మురుసుకుంటున్నారు గాని మా మగవాళ్లమైతే భార్య యెంత విద్యావంతురాలైనా కానీ, యెంత ఆస్తిపరురాలైనా కానీ, యెంత సంపాదనపరురాలైనా కానీ, ఫలానిఆమె మొగుడూ అంటె హత్య చేసుకుంటాము గని, ఆమోదిస్తామా! అంతటిమాటా యెందుకు. నన్నెవరైనా రాజేశ్వరీ పతీ! అని పిలవనీ. పిలిచినవాడిని చెంపలు వాయించుతానో లేదో ?” అన్నాడు రాఘవరావు.

రాజేశ్వరి పకపకా నవ్వి “మే మంత అఘాయిత్యం చేయలేము సుమండీ” అన్నది.

“దాస్యపువాతావరణంలో పుట్టి పెరిగిన జీవులు మీరు మీకు వ్యక్తిగౌరవం ఏమి తెలుసుం”దన్నాడు రాఘవరావు. “అవును తరతరాలనుంచీ స్త్రీ ఆధిక్యత నంగీకరించని జాతికి చెందిన మహనీయులు మీరు ఫలాని ఆమె పెనిమిటి అంటే సహిస్తారా మరి ?”

“సహించడం మాట......”

“ఇంతకు ప్రయాణం మాటేమిటి ?”

“అయితే మహిళాసభకు వెళ్తావా ఏమిటి ?”

“వెళ్తాను ఎన్నాళ్లనుంచో చూడాలెనని ఉన్నది. క్రిందటిమాటూ వెళ్లవలెనంటే పడ్డదికాదు. ఈ మాటైనా వెళ్లిచూచివస్తాను. ఎక్కడో దూరపు

జిల్లాల్లో జరుగుతుంటే చూచేదిలేనేలేదు. మన జిల్లాలో జరిగేదైనా చూచివస్తాను."

"ఐతే ప్రయాణంగట్టు."

"ఎప్పుడు?"

"ఇవ్వాళే మూడుగంటల బండికి."

"మూడుగంటల బండికా? గుంటూరు వెళ్లేటప్పటికి బాగా చీకటిపడదూ?"

"అయ్యో! చీకటిపడితే రైలు దిగలేనిదానవేనా సమానహక్కులు కోరుతున్నావు మాతోబాటు?"

"యుగయుగాలనుంచి మమ్మల్ని వంటయింట్లలో నిర్బంధించి మాశక్తియుక్తులన్నీ అడగగొట్టి ఇప్పుడు ఒంటరిగాపోలేదంటే ఏమిచేస్తాము? చిన్నప్పటినుంచీ ధైర్యసాహసాలను అలవర్చిఉంటేగదా ఎవరికైనా ధైర్యస్థైర్యాలుండేది?"

"అయినా భయంలేదు. శ్రీమతులను యెదుర్కోడానికి కొందరో స్త్రీలు రైలువద్ద వేచిఉంటారు. వారు సురక్షితంగా నిన్ను బసకు చేరుస్తారు. కనుక ఒంటరిగా వెళ్లినా భయంలేదు."

"నేను ప్రతినిధుల బసకుపోను. మామయ్యగారియింటికి పోతాను. పిల్లలకు పాలునీళ్లు ఆ బసల్లో ఎక్కడ అమురుతాయి?"

"అట్లయితే మీమామయ్యకు ఇప్పుడే వైరుచేస్తాను. ఆయన రైలువద్దకు మనిషిని పంపుతారు."

"పోనీ మీరుగూడా రాగూడదా ఎట్లాగో శని ఆదివారాలు కచ్చేరి ఉండదుగదా."

"మా మగవాళ్ల హక్కులన్నీ ఊడగొట్టేటువంటి సభకు నీవు డెలిగేటుగా పోవడమూ నీకు నేను తోడు రావడమూనా?"

"మీ మగవారిమీద తీర్మానాలెవరు చేస్తున్నారు? మాకీ యీ సౌకర్యాలు కావాలెనని కోరుకుంటాము అంతే. అవి మీమీద తీర్మానాలెట్లా అవుతాయి?"

"మీరుకోరిన సౌకర్యాలన్నీ మీ కిచ్చేటట్లయితే మా కసౌకర్యమేగాదా?"

"స్వార్థపరత్వానికి మగవారు పెట్టింది పేరు."

"పరార్థములను భంగపుచ్చేవాళ్లం మాత్రం కాము."

"ఇంతకూ గుంటూరు వస్తారా? రారా?"

"దయచేసి రాను"

"అయితే మామయ్యకు టెలిగ్రామివ్వండి. స్టేషనువద్దకు ఎవరైనా పంపుతాడు" అని రాజేశ్వరి లోపలికి వెళ్లింది.

"అయితే వెంటనే టెలిగ్రామిస్తే మంచి"దని రాఘవరావు పడకకుర్చీలోనుంచి చివాలునలేచి గదిలోకి వెళ్లి బీరువాలో మనీపర్సుతీసి జేబులో పెట్టుకొని ఉత్తరీయం బుజానవేసుకొని బజారుకు బయలుదేరాడు. ఇంతలో రాజేశ్వరి వంటయింట్లోనుంచి వచ్చి "టెలిగ్రాము యివ్వడానికి వెళ్తున్నారా?" అన్నది.

"అవును."

"అక్కడనుంచి బజారుకుగూడా వెళ్లివస్తారా?"

"వెళ్లిరమ్మంటె వెళ్లివస్తాను. ఏమికావాలేమిటి?"

"సభలో పిల్లలు యేడిస్తే చేతిలో బెట్టడానికి ఒక బిస్కట్లపొట్లాము తేండి. యింకా మా మామయ్యగారి పిల్లల కివ్వడానికి రెండుపొన్న పెప్పరమెంట్లు."

"సరే తీసుకొస్తాను."

"అయ్యో! వినిపించుకోకుండా వెళ్తారేం?"

"ఇంకా యేమిటి?"

"సన్నపూవుల వాయెల్ ఎనిమిదిగజాలు తలలో గుచ్చుకోనే......"

"అబ్బబ్బా మీ ఆడవాళ్ల ప్రయాణమూ అంటె భయమేస్తుంది."

"చిన్నసూదిదగిరనుంచి మీ చేతిమీదుగా రావాలె

గనుక మేము యెంత అవసరమైన వస్తువుకోరినా అబ్బబ్బా అంటారు. అదే మీకు కావాలసొస్తే మాట్లాడకుండా తెచ్చుకుంటారు. మొన్న మీరు బొంబాయి వెళ్లటానికి యెన్నినూట్లు ఖర్చించారు. ఎన్నిబూట్లుకొన్నారు! మాటవరసకైనా అబ్బా యింతైందని అనుకున్నారా? మీకేమి చేతులారా సంపాదించుకుంటారు గనుక మనసారా కర్చుపెట్టు కుంటారు.'' ''మీరుగూడా సంపాదించుకోరాదా? మాపని తేలికవడుతుంది.''

''అదేఉంటే మా స్త్రీల పరాధీనత ముక్కాలు మువ్వీసం తగ్గేపోవును.''

''ఔరా! మీ మనస్సులో ఎన్ని భావాలు పుట్టు తున్నాయి.''

''ఎన్ని పుట్టేనేమి? నీళ్ళల్లోపుట్టిన బుడగలు నీళ్ళలో కలియవలసిందేగాని వానికి ప్రత్యేకతే మున్నది?''

''నిజంగా యిది మహిళాయుగం'' అంటూ రాఘవరావు చిఱునవ్వు నవ్వుతూ లోపలికివచ్చి డబ్బు తీసుకొని బజారుకు వెళ్లాడు. రాజేశ్వరి ప్రయాణపు సర్దుబాటులో నిమగ్నురాలైంది.

2

సరిగా రెండుగంటలకు గుఱ్ఱపుబండివచ్చి వాకిట్లో నిలిచింది. రాజేశ్వరి సామానంతా సర్దుకొని బిడ్డలకు తలలుదువ్వి నీళ్లుపోసి మంచిదుస్తులు వేసి తానుగూడా చక్కగా ముస్తాబై గదులకన్నిటికీ తాళాలు పెట్టు తున్నది. రాఘవరావు వరండాలోపచారుచేస్తూ బండిని చూడగానే సామానుబండీలో పెట్టరా అని నౌకరుతోజెప్పి లోపలికివచ్చి ''యింటరు తీసుకోమం టావా?'' అన్నాడు రాజేశ్వరితో. ''యింటరులో స్త్రీలకు ప్రత్యేకపుపెట్టె ఉంటుందా'' అన్నది రాజేశ్వరి. ''బహుశా యీబండిలో ఉండదనుకుం టా''నన్నాడు రాఘవరావు. ''అయితే మూడవక్లాసే తీసుకోండి హాయిగా మాటామంతీ ఆడుకుంటూ కూర్చోవచ్చు''న్నది రాజేశ్వరి.

''ఇంటరులో మాత్రం మాట్లాడుకోగూడదా?''

''ఎవరితో?''

''ఉన్నవాళ్లతోనే.''

''ఎవరో మగవాళ్లుంటే వాళ్లతో నాకేమి మాటలు? అట్లాంటిది మీరు వెంటఉంటే ఏబండిలో నైనా కూర్చోవచ్చును.''

''సరి నీవు యెక్కడికి బోయినా బాడీగార్డుగా నేను వెంటనుండాలె కాబోలు.''

''అయినా యిప్పుడెందుకు? మూడోక్లాసు టికెట్ తీసుకుంటే ఆడవాళ్లపెట్టె తప్పకుండా ఉం టుంది కనుక అందులోనే కూర్చుంటాను.''

నౌకరూబండివాడూ సామాన్లు బండిలో పెట్టారు. రాజేశ్వరీ పిల్లలు బండిలోయెక్కారు. రాఘవ రావు సైకిల్ మీద యెక్కి ముందుగా స్టేషనుకువెళ్లి టికెట్లు తీసుకున్నాడు.

ఇంతలో రాజేశ్వరి పిల్లలు యెక్కిన జట్కాబండి వచ్చింది. లైసెన్సుకూలీని సామానులోపలికి తీసుక పొమ్మనిచెప్పి జట్కావాడికి బండిబాడుగ యిచ్చి భార్యనుబిడ్డలను ప్లాటుఫారంవద్దకు తీసుకొనివెళ్లాడు రాఘవరావు. ''పిల్లల నెట్లా పట్టుకుంటావో కిటికీల వద్దకు పోతారు, తలుపులు వేయబోతారు, తలక్రిందికి వంచుతారు. జాగ్రత్తసుమా'' అని రాఘవరావంటూ ఉంటే ''యిల్లు జాగ్రత్త సుమండీ నౌకర్లమీద యిల్లు వదిలిపెట్టి పోతున్నాను. సుబ్బమ్మ కొంచెం చెయి వాడి మనిషిగూడాను'' అని రాజేశ్వరి చెప్పుతూ ఉన్నది. మాట్లాడుతూ ఉండగానే కూతలు పెట్టు కుంటూ రైలుప్లాటుఫారంమీదికి వచ్చింది. స్త్రీల పెట్టెలో భార్యనూ బిడ్డలనూ యెక్కించి ''యిక నేను ఉంటా'' నన్నట్టుగా భార్యవంక చూచాడు రాఘవ

రావు. "అయ్యో వెళ్ళుతున్నారా? ఈబండిలో యెవరూ ఎరిగిన వాళ్ళుఉన్నట్టులేదు. పిల్లలతో ఎట్లా వెళ్ళుతారో" అన్నట్టుగా బిక్కమొగంతో పెనిమిటివంక చూచింది రాజేశ్వరి. ఆమె పిరికిమాపులు చూచి "నేనుగూడా ప్రయాణమై రాకపోతి"నని జాలితో అనుకున్నాడు రాఘవరావు మనస్సులో. కాని రైలు కదిలి పొయ్యేటప్పుడు ప్రయాణపు ఆలోచనలు చేసి ప్రయోజన మేమున్నది? గమనోన్ముఖమైన పొగబండి ఒక్కకూతకూసి ఒకరినొకరు విడవలేకున్న సతీపతులను నిర్దాక్షిణ్యంగా విడదీసి నడకసాగించింది.

బండి దృష్టిపథంనుండి తొలిగేదాకా చూస్తూ నిలబడి చల్లంగా యింటికొచ్చాడు రాఘవరావు.

కచ్చేరినుండి యింటికి వచ్చింది మొదలు భార్యతో కూడా తిరుగుతూ ముచ్చట్లుచెపుతూ పరిహాసాలు చేస్తూ పొద్దులు పుచ్చడం రాఘవరావుకు అలవాటు. అందువల్ల భార్యా బిడ్డలులేని యిల్లు చూస్తే అతని వల్లమాలిన విచారంకలిగింది. ఒక్క నిముషమైనా యింట్లో నిలవడానికి బుద్ధి పుట్టలేదు. వేళగాకపోయినా బ్యాటు తీసుకొని క్లబ్బుకు వెళ్లాడు. రాత్రి యెనిమిది గంటలదాకా అక్కడే ఉండి మటునాటి కాలక్షేపం నిమిత్తం మిత్రులను పేకాడుకొందాము రండని పిలిచి యింటికి చక్కా వచ్చాడు.

## 3

సోమవారం సాయంత్రం అయిదుగంటల బండి దిగి రాజేశ్వరి యింటికి వచ్చేటప్పటికి రాఘవరావు యింకా యింటికి రాకపోవడంచేత పిల్లలు తండ్రి కోసం యెదురు చూస్తున్నారు. పనివాళ్లంతా అమ్మగారొచ్చారని ప్రేమపురస్సరంగా పలకరిస్తున్నారు. సుబ్బమ్మ వచ్చి రాత్రికి వంట యేమిచేయమంటారని అడుగుతున్నది.

"మా తమ్ముడికి రోజూ రాత్రిపూట కందిపచ్చడి ఉండి తీరాలె. పంతులుగారికి కూర తప్పని సరిగదా. పిల్లలకు పప్పుపులుసు యిష్టం. అప్పడం వడియం ఏదో చూడు. మధ్యాహ్నం చేసిన పులుసు పచ్చళ్లు ఉన్నవా? ముందు పిల్లలకు వేడినీళ్లు కాచి యివ్వు. పాలు గలిపి పోయాలె" అని యజమానురాలి ఠీవితో సుబ్బమ్మకు వంట పురమా యిస్తున్నది రాజేశ్వరి. ఇంతిలో రాఘవరావు యింటికి వచ్చాడు. నాన్న వచ్చాడు, నాన్న వచ్చాడు అంటూ పిల్లలు గంతులు వేస్తూ తండ్రికి యెదురుబోయినారు. రాఘవరావు చిన్నవాడిని యెత్తుకొని పెద్దపిల్లను వ్రేలు పట్టుకొని నడిపిస్తూ లోపలికి వచ్చాడు. నాన్నా! యీ బండికే వచ్చాము అని కుఱ్ఱవాడంటే, మామయ్యగూడా వచ్చాడు నాన్నా! అన్నది లీల. "ఎవరు శ్రీనివాసులా?" అన్నాడు రాఘవరావు రాజేశ్వరి వంక చూచి.

"అవు"నన్నది రాజేశ్వరి. "ఏడీ శ్రీనివాసులు అప్పుడే యెక్కడికి పోయినా"డని రాఘవరావంటూ ఉండగానే కాళ్లూ చేతులూ కడుక్కువద్దామని దొడ్లోకి వెళ్లిన శ్రీనివాసులు తువ్వాలుతో ముఖమూ చేతులూ తుడ్చుకుంటూ సావట్లోకి వచ్చాడు. రాఘవరావతన్నిచూచి "ఏమిరోయి శ్రీనివాసులూ ఆజ్ఞలేని ఆనన్న బియ్యేకు అనాలోచితంగా పిల్లనిచ్చినందుకుగాను అపరాధంక్రింద నన్నుగూడా పోషించండని అత్తవారి యింట్లోనే ఉంటున్నావా ఏమి?" అన్నాడు.

"లేదు బావా!" అన్నాడు శ్రీనివాసులు చిఱునవ్వుతో.

"సరె, సరే క్షణంలో యెంత అల్లిక వేశారు? మహిళాసభ రేపనంగా నేను వెళ్లిననాడే వాడూ వచ్చాడుట. అంతట్లో వాడు అత్తవారింట్లో ఏండ్లూ పూండ్లూ ఉన్నట్టు మాట్లాడుతున్నా రేమ"న్నది రాజేశ్వరి.

"ఓహో! ఏమిటి చెప్పవూ. మహిళాసభకు డెలిగేటుగా వచ్చాడా. ఆ సంగతి నా కేమితెల్సు చెప్పవేం మరీ" అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

"ఆడవాళ్ల సభకు వాడెందుకు డెలిగేటుగా వస్తాడు" అన్నది రాజేశ్వరి అభిమానంతో.

"బావకథకుడు గాదూ. అట్లా అల్లుకుపోతూ ఉంటాడులే" అన్నాడు శ్రీనివాసులు.

"కథలమాట యెత్తబోకు. మీ అక్కయ్య కిప్పుడు కొండంతకోపం వస్తుం" దన్నాడు రాఘవరావు.

"వస్తే నీ కేమిభయమా?" అన్నాడు శ్రీనివాసులు.

"మీ అక్కయ్య తను మహిళాసమాజంలో స్వయంగా అగ్రాసన మధిష్ఠించి మూడు తీర్మానాలు చేసినప్పటినుంచీ నాకు భయమేమిటి కాస్తాకూస్తా గాదు. వల్లమాలిన భయంపట్టుకున్నది. మళ్లీ మళ్లీ ఎటువంటి రిజల్యూషన్సు చేయిస్తుందో అని. ఇవి ఆడవాళ్లకు భయపడాలిసిన రోజులురా! నీకు తెలుసునో తెలియదో" అన్నాడు రాఘవరావు

"అబ్బో యేమి భయపడుతున్నారో పడుతున్నారు. నిజంగా ఈరోజుల్లో ఆడవాళ్లనుగురించి మీ మగవాళ్లు వ్రాస్తూఉన్న వ్రాతలవంటి వ్రాతలు యేనాడూ యే మగవాళ్లూ వ్రాసిఉండలేదు. ఏకథ చూచినా, ఏ వ్యాసంచూచినా, ఏ పాటచూచినా, ఏ పద్యంచూచినా స్త్రీలనుగూర్చిన నిందలూ, అధిక్షేపణలూ, అనుచితపువర్ణనలూ" అన్నది రాజేశ్వరి

"అదిగో ఆరంభమైంది తామసోపన్యాసం" అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

"అవును. ఇప్పటి అసభ్యపువ్రాతలు తలంచుకుంటే నాకు తామసమే వస్తుంది నిజంగా. స్త్రీని భోగ్యవస్తువని రసికులూ, పురుషునికి చెందిన వస్తువాహనములవంటి జడపదార్థమని అధికారదృష్టిగలవారూ, హేయపదార్థమని వేదాంతులూ, ఎవరికి తోచినట్లు వారు వారివారి చిత్తవృత్తులనుబట్టి వ్రాస్తూఉంటారు. ఈ వర్ణనలు చూస్తే గ్రుడ్డివాళ్లు యేనుగును వర్ణించిన కథగా ఉంటుంది. నలుగురు గ్రుడ్డివాళ్లు ఏనుగు ఎట్లా ఉంటుందో తెలుసుకోబోయిం ఒకడు కాలుపట్టి చూచి ఏనుగు స్తంభంలాగుంటుందన్నాడుట. ఇంకొకడు చెవిపట్టుకచూచి యేనుగు చేటలాగుంటుందన్నాడుట. ఇంకొకడు తొండంపట్టుక చూచి ఎబ్బే! స్తంభమంతేలా వెక్కడిది రోకలంత లావుంటుందో అంతకంటే కాస్త మించో అన్నాడుట. అట్లాగే స్త్రీనిగూడా వర్ణిస్తుంటారు తమకు తెలిసినంతవరకూ. అంతేగాని అగాధమైన నారీహృదయం పూర్తిగా తెలుసుకున్నవారెవరూలేరు. భగవంతుడు పురుషులను యేదినుసు పదార్థంతో చేశాడో స్త్రీనిగూడా అదేపదార్థంతో చేశాడు. కనుక స్త్రీ పురుషుడితో సమానమైన స్వరూప స్వభావలక్షణాలు గల మానవప్రాణిగాని మగవారి కలవుపోకడలకు ఆస్పదమైన శుద్ధజడపదార్థం గాదు" అన్నది రాజేశ్వరి తీవ్రంగా.

"అబ్బో! అబ్బో! ఇదిగో శ్రీనివాసులూ! యీ పురుషులతో సమానమైన మానవప్రాణి మొన్న గుంటూరు ఒంటరిగాపోలేక తల్లకిందులైందిగోయి. యిప్పు డీ బింకపుమాటలు చూచావా" అన్నాడు రాఘవరావు విరగబడి నవ్వుతూ.

"ఎల్లప్పుడు ఇనుపపంజరంలో పెట్టి బంధించిన పక్షికి దాని యెగిరేశక్తి కుంటుపడిపోయి ఉండదా? అయినా ఆ తప్పుమాత్రం యెవరిది?" అన్నది రాజేశ్వరి. రాఘవరావందుకు సమాధానం చెప్పకుండా "ఓహో! ఇక్కడఉన్న కొద్దీ మనమీద తప్పు లెక్కలైపోతున్నాయి గాని షికారుపోదాము వస్తావుటా శ్రీనివాసులూ!" అన్నాడు బావమఱదితో. నవ్వుతూ వస్తానన్నాడు శ్రీనివాసులు. బావమఱదు

లిద్దరూ షికారువెళ్లారు. రాజేశ్వరి ప్రయాణపు సామానులు సర్దుకుంటున్నది.

## ౪

రాత్రి యెనిమిది గంటలైంది. రైలు ప్రయాణంలో హైరానుపడి ఉండటంచేత పెద్దపిల్ల లిద్దరూ అన్నంపెట్టగానే నిద్రపోయినారు. పసిపిల్లగూడా పాలుత్రాగి అలిసిపోయినట్టు పడుకున్నది. ఇంట్లో నిశ్శబ్దం రాజ్యం చేస్తున్నది. రాజేశ్వరి విశ్రాంతిగా కూర్చుండి మహిళాసభావృత్తాంతాలు నెమరువేసుకుంటున్నది. సుబ్బమ్మ వంటపని అయినందువల్ల పంతులువారి రాక యెదురుచూస్తూ తలుపు నానుకొని కూర్చుండి సన్నసన్న కునుకులు దీస్తున్నది. ఇంతలో రాఘవరావూ శ్రీనివాసరావు యింటికి వచ్చారు. వచ్చే రావడంతోటే వంటైందా అన్నాడు రాఘవరావు. అయినదన్నది రాజేశ్వరి. "అయితే భోజనంచేద్దాము. ఎందుకు ఆలస్యం" అన్నాడు రాఘవరావు.

రాజేశ్వరినిగూడా తమతో భోజనానికి కూర్చోమన్నాడు. తర్వాత భోజనం చేస్తానంటే రాఘవరావు ఒప్పుకోలేదు. అందరు భోజనానికి కూర్చున్నారు. భోజనాలవుతున్నాయి. "ఏమిరా శ్రీనివాసులూ ఉద్యోగంమాట యేమీ ఆలోచిస్తున్నట్టులేదేం" అన్నాడు రాఘవరావు.

"ఆలోచించ కేమి అయినా ఎక్కడున్నాయి ఉద్యోగాలు ?"

"మీ మామగారేమీ ట్రైచేయడంలేదా ? ఆయనకు జిల్లాబోర్డు ప్రెసిడెంటుతో వారితో స్నేహితం కాబోలునే."

"స్నేహపుసిఫారసులకు ఉద్యోగాలిచ్చే రోజులుపోయి చాలారోజు లైంది."

"అట్లాగైతే మామగారి యింట్లోనే యిల్లిటం ఉండు. ఇప్పుడు కళాశాలాపట్టభద్రులు చాలా మంది నిరుద్యోగ సమస్యను యిట్లాగే పరిష్కారం చేస్తున్నారు. కాఫీ ఫలహారం భోజనం వగైరాలు వేళకు భయభక్తులతో అమురుతాయి భార్యగూడా ఉంటుంది. దివాకులుచేస్తూ దర్జాగా ఉండవచ్చు."

"అత్తవారియింట్లో చాలారోజులుంటే అల్లుడి గౌరవం అడగనక్కరలేదు. వారవుబ్రాహ్మడికన్నా కనాకష్టమైపోతాడు."

"ఆ అట్లా యెందుకు జరుగుతుంది? అదేమంటే నా భార్యను నాకు పంపించండి ఎక్కడికో యేవూరికో యేదేశమో తీసుకపోతానని గడబిడచేస్తే సరి చచ్చి ఊరుకుంటారు."

"వాళ్ళయింట్లో మనం పీటలుపెట్టుకొని కూర్చోడ మెందుకు ? వాళ్ళగౌరవించారనుకోడ మెందుకు? ఎప్పుడో మర్యాదగా వాళ్లు పిలిచినప్పుడే వెళ్లితే గౌరవంగా ఉంటుందిగా."

"ఒరే నీవిట్లా దేవయ్యారగా ఉన్నావంటే ఎవడూ ఉద్యోగమీయడు. సరిగదా అత్తమామలూ ఘనంగా చూడరు. పెళ్లాంగూడా చెప్పినమాట వినదు. ఆఖరికి యేఫిలింస్టూడియోలోనూ యాక్టుచేయడానికీ ఏ గ్రామోఫోనులోనూ రికార్డివ్వడానికీగూడా పనికి రాకుండాపోతావు తెలుసునా ?"

రాఘవరావూ శ్రీనివాసులూ కుర్చీలమీదకూర్చు తాంబూలం వేసుకుంటున్నారు. ఉయ్యాల్లో పసిపిల్ల కదులుతూఉంటే రాజేశ్వరి మెల్లగాపోయి బిడ్డను చిచ్చిగొట్టి ఊపుతూఉన్నది.

"రాజేశ్వరీ ఇంతకూ గుంటూరుపోయి రావడం తప్ప మీ మహిళాసభ యెట్లా జరిగిందో డైవోర్సు తీర్మానం యేమిచేశారో యేమీచెప్ప వేం" అన్నాడు రాఘవరావు. రాజేశ్వరిబిడ్డ బాగా నిద్రపోయినట్టు చూచి సావట్లోకివచ్చి "ఇంకా యేమి డైవోర్సు మహిళాసభలో రూపులేకుండా పోయిందన్నది."

"ఏమీ డైవోర్సు తీర్మానం మహిళాసభలో ఎవరూ పెట్టనే లేదా ?"

"పెట్టలేదు"

"పోనీ బ్రతికిపోయినాము. మన దాంపత్యానికి మరోసంవత్సరంవఱకూ స్థిరత్వమేర్పడింది."

"డైవోర్సుప్యాసైతేమాత్ర మనదాంపత్యానికేమి నష్టం ?"

"నష్టమంటే నష్టమే. నీ సావాసకత్తె లెవరైనా పెనిమిటితో డైవోర్సు పుచ్చుకుంటూ ఉంటే అది నీకుగూడా ముచ్చటైతేనే నేమిచేయను? ఈ ముగ్గురు పిల్లలూ నేను"

"చెల్లమ్మగారి పెనిమిటి చెప్పినట్లే చెప్పతున్నారే."

"ఏమి చెప్పాడుట ?"

"'ఒసే నీవు చూడబోతే ఆరుగురు బిడ్డల తల్లివి. ఆ మహిళాసభలో డైవోర్సు ప్యాసుచేస్తున్నారు. దానిప్రకారం మన మిద్దరం మన వివాహం బందం త్రెంచుకొని విడిపోవాలె. అప్పుడు నిన్నూ పిల్లలనూ యెవరు మాస్తారు. ఇంతమంది పిల్లలు గలదాని నిన్నెవడు కట్టుకుంటాడు? నిష్కారణంగా అన్యాయమైపోతావు. అటువంటిది ఆ మహిళాసభ. ఆ సభకు పోవాక దానికి చందా యివ్వవాక' అని చెప్పాడుట. అంతటితో ఆమె హడలిపోయి వదినెగారు నేను మహిళాసభకు రానండి. మావా రిట్లా చెప్పా రన్నది. ఏమైనాసరే, మీ మగవారికి డైవోర్సంటె సింహస్వప్నంలాగా ఉన్నది లెండి. అందువల్ల యెన్ని అభూతకల్పనలైనాచేసి ఆడవాళ్లను హడలేస్తున్నారు."

"నా కాభయ మేమీలేదు. నీవు నిక్షేపంలాగా విడాకులుపొంది మఱో........."

"అబ్బా! ఏమి మాటలండి! మీకు తప్పొ ఒప్పొ తెలియదు. ఏది పట్టుకుంటే అదే."

"అబ్బో! విడాకులంటె యింత తప్పు పట్టుకుంటున్నావు గాని సమానహక్కులూ, స్వాతంత్ర్యము యిత్యాదులంటే ఉప్పొంగిపోతావే."

"దానికేమి. అవి మానవసహజమైన హక్కులు. అవి ప్రతిస్త్రీకి ఉండితీరాలె. అయితే విడాకులకు బదులు మగవారిమీద ఒకటి ప్యాసుచేశాము లెండి."

"ఏమిటది."

"భార్య జీవించిఉండగా యే మగవాడూ మళ్లీ పెళ్లి చేసుకోరాదని."

"లక్ష్య చేసుకోండి మాకేం."

"అవును. మీకేమీ? చట్టసభల్లో మెజారిటీ మీదేగా ?"

ఒకరు చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం (Oriental Manuscript Library, Madras) వెళ్లి అచటనున్న ఉద్యోగితో,

"ఏమండీ, 'కృషీవలుడు' అను అచ్చు పుస్తకాన్ని ఒకమారిస్తారా?"

ఉద్యోగి "ఇది 'లిఖితపుస్తక భాండాగారం' అని తెలీదూ ?"

అడిగి నాతడు వినయంతో "చిత్తం. వ్రాతప్రతే యిలా దయచేయించండీ."